క్లుప్తంగా

కల్యాణ వెంకన్న సేవలో సినీ నటుడు సుమన్



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామిని గురువారం ప్రముఖ సినీ నటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు వేదాశీర్వాదం అందించగా అధికారులు ప్రసాదాలతో సత్కరించారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

చంద్రగిరి (తిరుపతి రూరల్): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో చంద్రగిరిలో ర్యాలీ నిర్వహించారు. జీతాలు పెంచాలని, న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవో ప్రదీపకు వినతి పత్రం సమర్పించారు. సీఐటీయూ నాయకురాలు అమరావతి, లీలా, నాగభూషణమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశాలు

తిరుపతి కల్చరల్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు తిరుపతి నారాయణపురంలోని సంఘ కార్యాలయంలో శుక్ర, శనివారాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిశేషు, రాష్ట్ర సభ్యుడు ధనశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశాలకు విద్యార్థి సంఘం నేతలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రియల్‌మీ 11 సిరీస్ ఫోన్ ఆవిష్కరణ



మొబైల్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజారెడ్డి, వేదం మొబైల్ అధినేత ప్రభాకర్

తిరుపతి కల్చరల్: తిలక్ రోడ్డులోని సెంట్రల్ పార్క్‌లోని వేదం మొబైల్స్ షోరూంలో గురువారం కొత్త రియల్‌మీ 11 సిరీస్ ఫోన్‌ను ఆవిష్కరించారు. ఇందులో ఎస్వీయూ వీసీ రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొబైల్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేలా,ముందుగా డబ్బులు కట్టకుండా సులభ వాయిదాల పద్ధతిలో కట్టే విధంగా మొబైల్స్‌ను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రియల్‌మీ సంస్థ ఆంధ్రప్రదేశ్ హెడ్ ధనుంజయులు, భక్తిమాల బీడీ మురళి, మహేష్ పాల్గొన్నారు.

ఆపదలో అడవి



మంగళం సమీపంలోని అడవిలో చెలరేగిన మంటలు(ఫైల్)

- నిప్పు పెడుతున్న ఎర్రస్మగ్లర్లు, ఆకతాయిలు
- వెయ్యి హెక్టార్లలో అడవులు అగ్నికి ఆహుతి
- ముందస్తు చర్యలు తీసుకోని అధికారులు

వేసవి వచ్చిందంటేచాలు శేషాచలం కొండలు అగ్నికీలలకు ఆహుతవుతూ ఉంటాయి. వేలాది హెక్టార్ల అడవుల్లోని అరుదైన వృక్షాలు, గడ్డి మైదానాలు కాలిపోతున్నాయి. జీవజాతులు మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడిచిన కొన్ని రోజులుగా మంగళం తోపాటు రామచంద్రాపురం, తిరుపతి గ్రామీణ, చంద్రగిరి మండలాల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుని సుమారు వెయ్యి హెక్టార్లలో అడవి కాలిపోయింది.

– తిరుపతి మంగళం

వేసవికాలంలో సంభవించే అగ్ని ప్రమాదాలను అరికట్టడానికి అటవీశాఖ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల అడవుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. అటవీశాఖ అధికారులు అడవుల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏపుగా పెరిగిన బోదగడ్డి, రాలిన ఆకులను తొలగించడంతోపాటు ఫైర్ లైన్లను ఏర్పాటు చేయాలి. ఫైర్ లైన్లు అడవులను కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఎండిన ఆకులు, బోదగడ్డితోపాటు కొన్ని రాళ్లను ఫైర్ లైన్ మధ్య భాగంలోకి చేర్చి నిప్పుపెట్టి కాల్చేస్తారు. ఫైర్‌లైన్ మధ్యలో ఒకవేళ అగ్ని ప్రమాదం సంభవించినా మరో ప్రదేశానికి మంటలు విస్తరించే అవకాశం ఉండదు. ఈ పనులను అటవీశాఖ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. గతంలో మంటలను ఆర్పేందుకు గ్రీన్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్ ప్రొటెక్షన్ ఫోర్స్ పేర్లతో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై యువకులను నియమించుకునేవారు. వారితో సంచార దళాలను ఏర్పాటు చేసి నిరంతరం పహారా కాస్తూ, అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసుకునేవారు. ఒకవేళ సంభవించినా తక్షణం సదరు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేవారు. కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు, సిబ్బంది నియామకాలు చేపట్టడంలేదు. సాధారణంగా మార్చి నెలాఖరు, ఏప్రిల్, మే నెలల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచే ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే మంగళం సమీపంలోని అటవీ ప్రాంతంలో సంభవించిన అగ్ని ప్రమాదం కారణంగా వందల ఎకరాల అడవి అగ్నికి ఆహుతైపోయింది. అరకొర సిబ్బందితో అటవీశాఖ చేపట్టిన నష్టనివారణ చర్యలు ఫలితం ఇవ్వలేదు. అలానే రామచంద్రాపురం, తిరుపతి రూరల్ మండలం, చంద్రగిరి మండలాల పరిధిలోని అడవులు సైతం కాలిబూడిదవుతున్నాయి. అలాగే ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు శేషాచల పరిధిలోని తిరుపతి, చంద్రగిరి, మామండూరు, భాకరాపేట, తలకోన వంటి ప్రాంతాల్లోని అడవుల్లో మంటలు చెలరేగి సుమారు వెయ్యి హెక్టార్లు అగ్నికి ఆహుతి అయ్యాయి.

ప్రకటనలకే పరిమితమైన ఆధునిక యంత్రాలు

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఆధునిక యంత్ర సామగ్రిని సమకూర్చుకుంటున్నట్టు గతంలో అటవీశాఖ అధికారులు చెప్పారు. మంటలను అదుపు చేయడానికి రసాయనాలను వెదజల్లేందుకు నీటి స్ప్రేయింగ్ యంత్రాలు, బ్లోయర్లు కొనుగోలు చేస్తామన్నారు. సిబ్బంది ప్రమాదాలకు గురికాకుండా ప్రత్యేకంగా డ్రస్‌లను కూడా తెప్పిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

సిబ్బందిని సిద్ధం చేశాం

అగ్నిప్రమాదాలు నివారించేందుకు జనవరి నుంచి మే వరకు అడవుల్లో పనిచేసేందుకు ఫైర్ ప్రొటక్షన్ వాచర్లను నియమించుకున్నాం. శేషాచలం కొండలతోపాటు, రిజర్వు ఫారెస్టు ఏరియాల్లో 200 కిలోమీటర్ల పొడవునా ఫైర్ లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ఎన్జీవోల సహకారం కూడా తీసుకుంటాం. టీటీడీ అటవీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటాం. అగ్ని ప్రమాదాల సమాచారం ఇవ్వడంతోపాటు, మంటలార్పేందుకు సహకరించాలని అటవీ పరిసర గ్రామాల ప్రజలను కోరాం.

– సతీష్ రెడ్డి, అటవీ అధికారి, తిరుపతి జిల్లా

గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం గంగమ్మగుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. రెండు ప్రాంతాల్లో పెండింగ్ పనులను శరవేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నామన్నారు. అంతేవేగంగా ఇంటర్నల్ రోడ్ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గాంధీ విగ్రహం కూడలి– తుడా రోడ్డును కలుపుతూ అభివృద్ధి చేసిన గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టాగోపీయాదవ్, డీఈఈ దేవిక, కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, మునిశేఖర్ రెడ్డి, ఉదయ్‌వంశీ, రూపేష్ రెడ్డి, మురళీరెడ్డి, చింతా రమేష్‌యాదవ్, భరణియాదవ్ పాల్గొన్నారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసిన సీఐ ఓబులేశు



మోహిత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ ఓబులేశు

పాకాల: పాకాల సీఐగా బదిలీపై వచ్చిన ఓబులేశు గురువారం భారతంమిట్టలో గడప గడపకూ మహా పాదయాత్ర నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పాకాల పోలీస్‌స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయన చంద్రగిరి నుంచి బదిలీపై పాకాలకు వచ్చారు. ఇక్కడ పనిచేసస్తున్న సీఐ రాజశేఖర్ బదిలీపై చంద్రగిరికి వెళ్లారు. ఎస్ఐ వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు హర్షిత్‌రెడ్డి సారె



అమ్మవారికి పూజలు చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరులో గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనసూయమ్మ, సింగిల్ విండో మాజీ చైర్మన్ సిద్ధమునిరెడ్డి, ఎంపీటీసీ జ్ఞానమ్మ, తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీభానుకుమార్‌రెడ్డి, నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

19 నుంచి చంద్రగిరిలో మెడికల్ క్యాంపు



పనపాకంలో వైద్య శిబిరం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరం ఈ నెల 19 నుంచి చంద్రగిరి మండలంలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం చిన్నగొట్టిగల్లు మండలంలో చేపట్టిన వైద్య శిబిరం 18వ తేదీకి పూర్తి కానుంది. చంద్రగిరి మండలం పనపాకంలో 19న ప్రారంభమై అన్ని పంచాయతీల్లోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం చంద్రగిరి ఎంపీడీవో రమేష్ బాబు ఏర్పాట్లను పరిశీలించారు. పనపాకం హైస్కూల్, అరిగెలవారిపల్లి, రమణప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాలల ఆవరణాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శశిరేఖ, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, సింగల్ విండో చైర్మన్ వరలక్ష్మి, చెంగల్రాయులు, కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా రాజీలేని నిర్ణయాలు



లింక్ రోడ్డు నిర్మాణంపై పరిశీలన చేస్తున్న కమిషనర్ హరిత, భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత పేర్కొన్నారు. ఆమె గురువారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డితో కలిసి చెన్నారెడ్డి కాలనీ, దాసరిమఠం ప్రాంతాల్లో కనెక్టవిటి రహదారుల నిర్మాణ ప్రతిపాదనలపై పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ చెన్నారెడ్డి కాలనీ శ్మశానం నుంచి హరేరామ హరేకృష్ణ ఇస్కాన్ టెంపుల్ రోడ్డును కలుపుతూ స్లిప్ వే రోడ్డు నిర్మాణం చేపట్టాలని, దాసరి మఠం ప్రాంతం నుంచి డీఆర్ మహల్ రోడ్డును కలుపుతూ కనెక్టవిటీ రోడ్డు నిర్మించేందుకు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రతిపాదించారని తెలిపారు. వాటి నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ చెన్నారెడ్డి కాలనీ వాసులకు డైరెక్ట్ మెయిన్ రోడ్డు యాక్సెస్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కనెక్టివిటీ రోడ్డుతో చెన్నారెడ్డి కాలనీ వాసులు నేరుగా మెయిన్ రోడ్డులోకి రావొచ్చన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పునీత, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీఈ మహేష్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, నాయకులు బొగ్గుల వెంకటేష్, శ్యామల, నరసింహ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రాపురం: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పనుల్లో కొలతలు ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పని ప్రదేశంలో ఫొటోలు తీసి ప్రతిరోజూ ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సిబ్బందికి వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ హంసవేణి, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ



చెక్కులు ఇస్తున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం మిట్టపాలెంలో ప్రమాద బాధిత కుటుంబాలకు మంజూరైన వైఎస్సార్ బీమా నగదును గురువారం చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. మిట్టపాలెం పంచాయతీ కొత్తూరు దళితవాడకు చెందిన ఎం.ప్రభాకర్, మంగాపురం ఎస్సీ కాలనీకి చెందిన పి.కృష్ణయ్య ఇటీవల మరణించారు. వారికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష చొప్పున మంజూరైంది. ఎంపీపీ హేమెంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

ఏపీఈఏపీ సెట్‌లో చంద్రగిరి విద్యార్థుల ప్రతిభ





చందన్‌కుమార్, స్రవంతి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో చంద్రగిరికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆదెమ్మ కుమార్తె స్రవంతి 351వ ర్యాంకును సాధించింది. నీట్‌లో రాష్ట్ర స్థాయిలో 4,653, ఆల్ ఇండియా స్థాయిలో 35,540 ర్యాంకు సాధించింది. చంద్రగిరి కోట గ్రామంలో ఉన్న దుర్గ దేవి, మునిరాజా కుమారుడు చందన్ కుమార్ ఇంజినీరింగ్ విభాగంలో 361 ర్యాంకును సాధించాడు.

సామాజిక వైరుధ్యాలను ప్రశ్నించిన కవి శ్రీశ్రీ



మాట్లాడుతున్న మేడిపల్లి రవికుమార్

తిరుపతి కల్చరల్: దోపిడీ, పీడన, ఆకలి వంటి సామాజిక వైరుధ్యాలను ప్రశ్నించిన కవి శ్రీశ్రీ అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు మేడిపల్లి రవికుమార్ తెలిపారు. ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో గురువారం మహా కవి శ్రీశ్రీ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముందు దగా వెనుక దగా కుడియెడమల దగా దగా... అన్న శ్రీశ్రీ మాటలకు నేటి సమాజం నిలువుటద్దమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈతరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమకాలీన సమాజంతో పాటు రాబోవు కాలానికి కూడా ప్రాతినిధ్యం వహించి శ్రీశ్రీ మహా కవిగా నిలిచారని కొనియాడారు. ఇంజినీర్స్ అసోసియేషన్ తిరుపతి శాఖ సంయుక్త కార్యదర్శి కె.జయప్రకాష్ మాట్లాడుతూ శ్రీశ్రీ అక్షర శక్తి, కవితా శిల్పం అనితర సాధ్యమని కొనియాడారు. తెలుగు భాషోద్యమ సమితి కార్యవర్గ సభ్యుడు ఎం.చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మల్లం దేవేంద్రనాథ్‌రెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి ప్రతినిధులు సాకం నాగరాజు, టెంకాయల దామోదరం, తమటం రామచంద్రారెడ్డి, పొక్కళ్ల సుభద్ర, పేరూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

అసలు, వడ్డీ చెల్లించాలని తీర్పు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో అసలుతోపాటు వడ్డీ చెల్లించాలని, లేనియెడల 6 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తిరుపతి 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గురువారం తీర్పుచెప్పింది. తిరుపతి రూరల్ మండలం ఎస్వీ నగర్‌కు చెందిన ఎం.నాగరాజు తన అవసరాల నిమిత్తం 2015 మార్చి 5న తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లి సమీపంలోని కొప్పరవాండ్లపల్లికి చెందిన వి.బాలకృష్ణయ్య వద్ద రూ.1.60 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో 2015 నవంబర్ 10న నాగరాజు ఇచ్చిన చెక్కు బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యింది. బాలకృష్ణయ్య కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి చెక్కు సొమ్ము రూ.1.60 లక్షలకు 9 శాతం వడ్డీ లెక్కన చెల్లించాలని తీర్పుచెప్పారు. నష్ట పరిహారం కింద రూ.2.05 లక్షలను బాలకృష్ణయ్యకు నెలలోపు చెల్లించాలని నాగరాజును ఆదేశించారు. అలాగే అప్పీలు కాలం ముగిసిన తరువాత రూ.10 వేలు ప్రభుత్వ ఖజానాలో జమచేయాలని తీర్పులో పేర్కొన్నారు.

భూసార పరీక్ష.. రైతన్నకు రక్ష



భూసార పరీక్షల వివరాలను పొందుపరిచే యాప్‌ను పరిశీలిస్తున్న డీఏఓ ప్రసాద్‌రావు

రామచంద్రాపురం: భూసార పరీక్ష చేయించుకోవడం ప్రతి రైతుకూ రక్ష అని తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు తెలిపారు. మండలంలోని సీరామాపురం రైతు భరోసా కేంద్రంలో గురువారం వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ ఈ–కేవైసీ, వైఎస్సార్ యంత్ర సేవా పథకం, భూసార పరీక్షలు తదితర అంశాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడి మంచి దిగుబడి పొందవచ్చని తెలిపారు. ఏవోలు స్రవంతి, శశికళ పాల్గొన్నారు.

టైలర్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్

తిరుపతి తుడా: స్థానిక జీవకోన ప్రాంతం అంబేడ్కర్ విగ్రహ కూడలి సమీపంలోని టైలర్ షాపులో బుధవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించింది. మెషిన్లు, దుస్తులు కాలిపోయినట్టు యజమాని ఎస్.శరవణ వాపోయారు. తాను 20 సంవత్సరాలుగా ఇక్కడే సొంతంగా టైలర్ షాపును నిర్వహిస్తున్నానని తెలిపారు. ఫైర్, పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు.

తిరుమలలో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి

తిరుమల: ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. గురువారం అర్ధరాత్రి తిరుమల చేరుకున్న ఆయనకు పద్మావతి అతిథిగృహం వద్ద టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు.

చంద్రగిరి ఆణిముత్యాలు

- ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు
- సీఎం సంకల్పంతోనే కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- విద్యార్థులకు ఎమ్మెల్యే చేయూత : చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): గతేడాది పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం జగనన్న ఆణిముత్యాలు పథకం కింద నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 10వ తరగతిలో నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.15 వేలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు, మెరిట్ సర్టిఫికెట్, మెమొంటోలు అందజేశారు. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎంతో గొప్ప సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా మార్చారని కొనియాడారు. ప్రతి విద్యార్థీ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు. ప్రతిభ సాధించే విద్యార్థులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సొంతంగా ట్యాబులు, ల్యాప్‌టాప్‌లు, గోల్డ్ మెడల్స్‌ను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మస్తాన్, ఎంఈవోలు లలిత కుమారి, వెంకటసుబ్బమ్మ, విజయ, ప్రిన్సిపాళ్లు రాజశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జగన్ మామ పథకాలు వల్లనే విజయం...



నా పేరు దుర్గమ్మ. మాది ప్రకాశం జిల్లా. మా నాన్న శ్రీనివాసులు ఆటో తోలుతూ జీవనం సాగిస్తూ నన్ను చదివించారు. ఎక్కడెక్కడో తిరిగాం. ఇంటర్లో హాస్టల్ సీటు లేక అవస్థలు పడ్డాం. చివరకు చంద్రగిరి హాస్టల్‌లో సీటు దొరికింది. చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీలో చేరాను. సీఎం జగన్ మామ పుస్తకాలు పంపిణీ చేశారు. నాయకులు మరికొన్ని పుస్తకాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు బాగా ఉత్తేజపరిచారు. అందుకే ఇంటర్లో 985 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించాను.

ఎంతో ఆనందంగా ఉంది



ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 586 మార్కులతో తిరుపతి జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వం విద్య వ్యవస్థ పట్ల తీసుకుంటున్న శ్రద్ధ, మంచి దారిలో నడిపిస్తున్న టీచర్ల వల్లే నేను ఈ విజయం సాధించాను. సీఎం జగన్ మామ ఇచ్చిన స్ఫూర్తితో బాగా చదివి ఉన్నత స్థానంలో నిలవాలని ఆశిస్తున్నా. ఇంటర్లోనూ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధిస్తా.

– యోగేశ్వర్, విద్యార్థి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల చంద్రగిరి

ఉపాధ్యాయుల కృషితోనే..



నేను హాస్టల్లో ఉంటూ అక్కడ ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి సబ్జెక్టునూ క్షుణ్ణంగా చదివాను. పాఠ్యాంశాలను పూర్తిగా అవగాహన చేసుకుంటూ ముందుకు సాగాను. ప్రతి సబ్జెక్టులో ఉత్తమంగా రాణించాలని అనుకున్నా. పరీక్షల్లో క్వశ్చన్ పేపర్ చూడగానే ఎంతో ఆనందం వేసింది. పరీక్షలు బాగా రాశాను. 584 మార్కులతో రెండో ర్యాంకు సాధించా. భవిష్యత్తులో ఇంకా బాగా చదివి రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధిస్తా.

– గణేష్ నాయక్, విద్యార్థి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల చంద్రగిరి